
ఏ వ్యక్తి విజయం సాధించాలన్నా, యెవరో కొందరి సహకారం అందితేతప్ప సాధ్యంకాదు. సహాయం అందించి, చాటుగానేవుండి నవ్వుతూ నిలబడగల ఆ "గొప్ప" వ్యక్తి యెవరు?

# నాలుగో సింహం



కాశీనాథ & కాశీనాథ

రవి ఫస్టు క్లాసు తెచ్చుకు తీరాలని నిర్ణయించుకున్నాడు.

ఈ కోరిక అతనికి ఎంతకాలంగానో ఉంది. అయితే ఇంత బలంగా లేదు. ఫస్టు క్లాసు రావాలని కోరుకోవడం, వస్తే ఎలా ఉంటుంది? అని ఊహించుకోవడం సరదాగా ఉంటుంది. కాని దానికోసం పడవలసిన శ్రమ తలచుకుంటే భయం వేస్తుంది. అది ఒక మహా యజ్ఞం. నిరంతర శ్రమ. విద్యార్థి జీవితంలో ఉండే సరదా అంతా వదులుకోవాలి. ఎప్పుడూ ఏదో బరువు మీద

సంప్రదాయ మాధురి

## మందార మకరందాలు

శ్లో॥ ఉపకర్తుం యథాస్వల్పః। సమర్థోన తథామహాన్।
ప్రాయః। కూప స్తృషాంహంతి। సతతం నతువారిధిః॥

లోకులకు సామాన్యులు వుపయోగపడేట్లు గొప్పవారు వుపయోగపడరు. చిన్నదైనా బావివల్ల ప్రజల దాహం తీరుతుందిగానీ, గొప్పదైన సముద్రం దప్పిక తీర్చలేదుగదా!

కంఠస్థం చేయాలి

ఉన్నట్లుగా భావించి చదవాలి. ఇంత శ్రమ ఫలితాన్ని కొద్దిరోజుల పరీక్షలో తేల్చేస్తారు. లేని అవసరాన్ని ఉన్నట్లు భావించుకుని ఏరోజు కారోజు "మర్నాడే పరీక్ష ఉన్నట్లుగా" చదివిన విద్యార్థి భవిష్యత్తు "ప్రమాణం అనలేని పరీక్షా విధానం"తో కొన్ని గంటల వ్యవధిలో తేల్చేస్తారు. అందులో అదృష్టానికి చెప్పుకోదగ్గ భాగం వుంది.

"అలా చదవడం కూడా తేలిక కాదు. మనిషి నైజంలోనే కొంత సోమరితనం ఉంది. 'పరీక్ష రేపు' అన్నప్పుడు మెదడు పనిచేసినంత పదునుగా కొన్నాళ్ళకు ముందు పనిచేయదు. ఎప్పుడో రాబోయే పరీక్షలకి ఇవాళే తొందర వచ్చినట్లుగా చదవాలని సలహా ఇవ్వడం తేలికే గాని, ఆచరణ ఎంత కష్టమో అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. "ఏ సంవత్సరానికా సంవత్సరం ఈ ఏడు మొదటి నుంచీ బాగా చదవాలని" నిర్ణయించుకోవడం, తర్వాత ఏరోజు కారోజు ఇవాళ ఒక్క రోజూ వేస్టు చెయ్యడంవల్ల ఏమీ పోదు రేపటి నుంచీ మొదలు పెటాలి" అనుకోవడం. అనుకుని గడిపెయ్యడం ప్రతి విద్యార్థికీ అనుభవమే.

రవికి ఎప్పుడూ కలిసిరాలేదు. బి.యస్‌సి. రెండవ సంవత్సరం పరీక్షలకి సరిగ్గా చదవలేకపోయాడు. అందుకని పరీక్షలకి వెళ్ళలేదు. మామూలు పాసు మార్కులు తెచ్చుకోవడం కష్టం అయి ఉండేది కాదుగాని. అతనిలో ఫస్టు క్లాసు కోసం ఆశ పరీక్షలకి పోనివ్వలేదు. మూడో సంవత్సరంలో సెప్టెంబరు వరకూ రెండవ సంవత్సరం సబ్జక్టులు చదువుకుని. మిగిలిన ఆరునెలలలో మూడవ సంవత్సరం సబ్జక్టులు చదవడం చాలాకష్టం అని తెలుసు. అయినా ఫస్టు క్లాసు వచ్చే అవకాశాన్ని 'సజీవంగా' ఉంచడమే మంచిదనిపించింది. ఇంగ్లీషు, తెలుగు మట్టుకు రాసి పాస్ అయాడు. తర్వాత సెప్టెంబరు పరీక్షలు నాలుగురోజులున్నాయనగా జ్వరం వచ్చింది. ఆ జ్వరం పదిరోజులుంది. దాంతో ఆ పరీక్షలకి వెళ్ళలేకపోయాడు

జ్వరం తగ్గి పథ్యం-పుచ్చుకున్న రోజు అతని పరిస్థితి ఏమిటంటే ఆరు నెలలలో రాబోయే పరీక్షలో రెండవ, మూడవ సంవత్సరం సబ్జక్టులు మొత్తం రాయాలి. బ్రహ్మాండమైన శ్రమ ముందుంది

ఆ రోజునే ఫస్టుక్లాసు తెచ్చుకు తీరాలని స్థిర చిత్తంతో నిర్ణయించుకున్నాడు రవి। ఈ నిర్ణయం ఒక రకంగా వచ్చినది కాదు. దానికి ఇద్దరు కారకులు. ఒకడు తండ్రి. రెండు మామయ్య.

ఇది ఎలా జరిగిందంటే పథ్యం పుచ్చుకున్న రోజున తండ్రి పిలిచాడు.

"ఏరా పరీక్షలకి చదవగలవా?"

రవి తల వంచుకున్నాడు. మాట్లాడలేదు.

"ఫస్టుక్లాసు తెచ్చుకోడానికి కృషి చెయ్యగలవా?"

రవి నెమ్మదిగా తల వూపాడు.

తండ్రి నరసింహారావుగారు పడక కుర్చీలో వెనక్కి వాలారు.

"చూడు. ఏదైనా ఒక పని విజయవంతంగా చెయ్యడానికి కోరిక - అర్జ్ - ప్రధానం. తర్వాత మొదటి అడుగు నమ్మకంగా, ధైర్యంగా వెయ్యాలి. ఇంగ్లీషులో ఒక సామెత వుంది. "ఎ జర్నీ ఆఫ్ థవుజండ్ మైల్స్ బిగిన్స్ విత్ ఎ స్టెప్"అని. వెయ్యి మైళ్ళ ప్రయాణం ఒక్క అడుగుతో ప్రారంభం అవుతుంది. వెయ్యి మైళ్ళు నడవగలమా అని ఆలోచిస్తే అసలు కాళ్ళు కదలవు. అడుగు పడదు. దూరం గురించి ఆలోచించకుండా ఒక్క అడుగు వేశావనుకో. ఆ అడుగు దూరం అయిపోయినట్టే" అన్నారు.

రవికి ఆ మాటలు నచ్చాయి. ఉత్సాహం వచ్చింది. నరాల్లో బలం పుంజుకున్నట్లు అనిపించింది.

ఆయన ఇంకా ఇలా అన్నాడు." ఒక పని మనం తలపెట్టి సమర్థవంతంగా చెయ్యాలనుకున్నప్పుడు నా జీవితంలో నేను నేర్చుకున్న సూత్రాలు కొన్ని వున్నాయి. అవి పాటించాలి. ఒకటి. అదే పని అంతకుముందు చేసిన వాళ్ళని కలుసుకుని సాధక బాధకాలు తెలుసుకోవాలి. వాళ్ళకన్నా బాగా సలహా ఇవ్వగలవాళ్ళు ఉండరు. ఇంతకు ముందు ఫస్టుక్లాసు తెచ్చుకున్న వాళ్ళని కలుసుకో.

"ఇంకో విషయం ఏమిటంటే 'పరీక్షలు - వాటిని ఎదుర్కోవడం' గురించి టీచర్లకి తెలిసినంతగా ఎవరికీ తెలియదు. ఎంతోమంది స్టూడెంట్స్ వాళ్ళకళ్ళముందు పరీక్షలు రాసి అదృష్ట దురదృష్టాలు తేల్చుకొని వెళ్ళిఉంటారు. ఆ స్టూడెంట్ల అనుభవాల సారం టీచర్లద్వారా మిగతావాళ్ళకి అందుతుంది. తెలివైన వాళ్ళమనే గర్వంతో పరీక్షలు పాడు చేసుకున్నవాళ్ళు, తెలివి ఎక్కువగా లేకపోయినా బాగా శ్రమపడి మంచి మార్కులు తెచ్చుకున్నవాళ్ళు వాళ్ళకి తెలిసి ఉంటారు. మంచిమార్కులు రాపడానికి ప్రస్తుత పరీక్షా విధానంలో సులువైన పద్ధతులు కూడా తెలిసి ఉంటాయి. మీకు పాఠాలు చెప్పినందుకు వాళ్ళకి జీతం ఇస్తారన్నమాట నిజమేగాని, బాగా చెప్పినందుకు ఎక్కువ జీతం ఇవ్వరు. అయినా డ్యూటీ ఫీలయి ఉత్సాహంతో అవసరమైన మానసిక శ్రమచేసి చెప్పేవాళ్ళు ఉంటారు. శ్రమకి ఫలితంగా కృతజ్ఞత కోరుకునే అలాంటివాళ్ళని కలుసుకొని సందేహాలు తీర్చుకో.

"ప్లానింగుకూడా ప్రధానం. పుస్తకం అంతా ఒక్కరోజులోనే చదివెయ్యాలని. మర్నాటికి అంతా తెలిసి ఉండాలని ఉత్సాహం ఉంటుంది. అది అసాధ్యం అని గుర్తించాలి. ఒక పుస్తకం ముందు కూర్చుంటే మరో పుస్తకం మీదికి దృష్టి పోతుంది. తీరా ఆ పుస్తకం తీస్తే దానిమీద దృష్టి నిలవదు చివరికి ఏదీ చదవకుండానే కాలయాపన జరిగిపోతుంది. ఎప్పుడు

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
మా చికిత్సవల్ల తెల్లమచ్చలు గల వారికి పూర్తిగా నయం అవడం ద్వారా మా వైద్యం మంచి కీర్తిసంపాదించింది. ప్రచారం నిమిత్తం ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా ఇవ్వబడును. మొదటి కోర్సుతో నే మచ్చల రంగు మారడం ఆరంభమవుతుంది. జబ్బు వివరాలు వ్రాయండి.
GAUTAM CHIKITSALAYA
(S-DD)
P. O. KATRI SARAI (GAYA)

దీర్ఘవ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండా రండి.
డా॥ దేవర, ఫోన్ 551, మార్వాడి గుడి వద్ద, తెనాలి.
SUVARNA
బ్రాంచి : 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు-17

RALLI-MIX Deluxe.

ఇండియాలో కెల్లా అత్యంత శక్తివంతమైన మోటారుగల
రాలి మిక్సి
డీలర్లు : స్టోనో ఏజన్
ఏలూరురోడ్డు, విజయవాడ-2
Suvarna

ఎంత చదివినదీ ఎంత దూరం ముందుకు వెళ్ళినదీ తెలుసుకునేవాళ్ళని ఏర్పరచుకోవడం ఒక పద్ధతి. డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వర్క్ కి టైము టేబులు వేసుకోవడం ఒక పద్ధతి. అనుకున్నది ఖచ్చితంగా ఆచరణలో పెట్టడం ముఖ్యం.

ఆచరణ, ఫలితం విషయంలో మనిషి వాస్తవిక దృష్టి ముఖ్యం. ఏ విషయంలోనైనా అనుకున్న దాంట్లో నాలుగింటికి మూడు వంతులు మాత్రమే సాధించగలమని మొదటి నుంచీ తెలియాలి. అనుకోని అవాంతరాలు రావచ్చు. టైము చాలక తెలిసినదంతా రాయలేకపోవచ్చు. చదివినదంతా గుర్తు రాకపోవచ్చు. పరీక్షలో ఆరోగ్యం దెబ్బతినవచ్చు. ప్రశ్నలు కఠినంగా వుండవచ్చు కాబట్టి అరవై మార్కులు వచ్చి తీరాలంటే ఎనభై మార్కులకి ప్రయత్నం చెయ్యాలి. చివరికి అరవయ్యే వస్తే అనుకున్న విధంగా అంతా జరిగినట్టే సంతోషించాలి.

“ఫలితం మనచేతిలోలేదని గుర్తించాలి. చిత్తశుద్ధితో పనిచేయడం వరకే మన వంతు. ఫలితం రాకపోయినా త్రికరణ శుద్ధిగా పని చేశామన్న తృప్తివుంటుంది”

రవి ఒక్కొక్క మాటనీ పరిశీలనగా విన్నాడు. విని తల వూపాడు. మనసు నిశ్చయం చేసుకున్నాడు.

రవికి కలిగిన పటుదలకి ఇదొక్కటే కారణం కాదు. పథ్యం తిన్న రోజునే వాళ్ళ మామయ్య వచ్చాడు. “ఏరా రవీ అంత చిక్కిపోయావేం? సెకండ్ యియర్ పరీక్షలు బాగా రాశావా?” అని అడిగాడు హడావుడిగా. పరీక్షలు రాయలేదన్నాడు రవి. జ్వరం వచ్చినట్లు చెప్పాడు.

“అయితే మొత్తం అన్ని పరీక్షలూ ఒక్కసారే రాయాలా?”

“ఆ”

“బాగా చదువు. ఫస్టుక్లాసులో రావాలి”

“అలాగే మామయ్యా”

ఆయన కొంతసేపు ఆగి “నువ్వు ఫస్టుక్లాసు తెచ్చుకుంటే టేపు రికార్డరు బహుమతిగా ఇస్తాను” అన్నాడు.

రవి సంభ్రమంగా చూశాడు. ఇది మామయ్య సరదాకి అన్నమాట కాదని తెలుసు. అలా మాట్లాడే తత్వం కాదు ఆయనది. పైగా ఒక వెయ్యి రూపాయల బహుమతి ఇవ్వటం ఆయనకి పెద్ద విషయం కాదు.

ఆరోజే వాళ్ళ మాస్టర్ని కలుసుకున్నాడు ఆయనకూడా కొన్ని విషయాలు చెప్పాడు. “చదువుమీద దృష్టి కేంద్రీకరించాలంటే పూర్తిగా చదువు వాతావరణం ఉండాలి. వీలయితే వేరే రూము తీసుకో. పాఠాలు చదువుతున్నప్పుడు అన్నీ అర్థం అయినట్టే వుంటాయి కాని పరీక్షల్లో రాయలేరావు. తెలిసిన విషయాన్ని మనసులో మననం చేసుకోవడం. స్వయం పరీక్షలో రాసి చూసుకోవడం చెయ్యాలి. ముఖ్య విషయం ఏమిటంటే “పాఠాలు నేర్చుకోవడా”నికి “పాఠాలు చెప్పడం” కంటే మంచి పద్ధతి ఇంకోటి లేదు. నీకంటే తక్కువ చదవగల స్టూడెంటుకి నీకు తెలిసిన విషయాలు ఎక్స్‌ప్లెయిన్ చెయ్యి. అప్పుడు నీకు ఎంత తెలుసునో, నీ విషయజ్ఞతలో ఏ లోపం వుందో తెలుస్తుంది. సైన్సు విషయాలు చదివితే కాన్సెప్ట్ ఏర్పడాలి. సాధారణంగా లెసన్ అర్థం చేసుకున్న దానికి తార్కాణం ఆ జ్ఞానంతో సమస్యలు - ప్రాబ్లమ్స్ - సాధించగలగడం”

రవి అన్ని విషయాలూ ఆకళింపు చేసుకున్నాడు. తను శ్రమపడటం తప్ప మిగిలిన అన్నీ తన ముందున్నట్టే ఉంది అతనికి. కోరిక బలంగా పాదుకుంది. భూనభాలు ఏకమైనా సాధించి తీరాలని నిర్ణయించుకున్నాడు.

అమ్మతో చెప్పాడు రవి. కాసేపు ఆలోచించి ‘ఎల్లుండి ఉదయం తొమ్మిది గంటలకి మొదలుపెట్టు’ అంది. రవికి ఆ రోజునే మొదలుపెట్టాలని ఉత్సాహంగా ఉంది. కాని అమ్మమాట విన్నాడు. చదవాలని ఉత్సాహం అంతా అణచుకుని సినిమాకి వెళ్ళాడు. ఇంటికి వచ్చి పడుకున్నాడు.

* * *

అనుకున్న ముహూర్తంలో చదువు మొదలుపెట్టాడు.

గదిలో టేబులు ముందు కుర్చీలో కూర్చుని కిటికీలోంచి బయటికి చూస్తుంటే ఇంటి ఎదురు ప్రహరీ గోడకి ఆనుకుని ఉన్న అశోకస్థంభం కనపడింది. పైభాగంలో నాలుగు సింహాలున్నాయి. సామాన్యంగా అశోకస్థంభం చూడటానికి అలవాటుపడ్డవాళ్ళకి, వీధిలో నుంచి చూసే వాళ్ళకి మూడు సింహాలే కనిపిస్తాయి. అందరూ మూడు సింహాలే అనుకుంటారు. రవి తన క్లాసు మేట్లని అడుగుతూ ఉంటాడు. అశోకస్థంభంలో ఎన్ని సింహాలుంటాయి? అని. ‘మూడు’ అంటారు వాళ్లు. రవి నవ్వి ‘భారత ప్రభుత్వం తన చిహ్నంగా తీసుకున్న సారనాథ్ స్థూపంలో నాలుగు సింహాలున్నాయి. బొమ్మల్లోను, చూసేవారికి మూడే కనిపిస్తాయి’ అని. నమ్మని వాళ్ళని ఇంటికి తీసుకువచ్చి నాలుగో సింహాన్ని చూపిస్తాడు.

ఇవాళ కిటికీలోంచి చూస్తే అశోక స్తంభం ఒక పక్కనే నిలబడి మూడు సింహాలే కనిపిస్తోంటే ఎప్పటిలాగే నవ్వు వచ్చింది.

*   *   *

రవి చదువు మొదలుపెట్టాడు. నాలుగు రోజులు ఉధృతంగా సాగింది. ఆ నాలుగు రోజులూ రాత్రి ఒంటిగంటదాకా మేలుకున్నాడు. నాలుగోరోజు అతి కష్టంమీద పన్నెండున్నరదాకా మేలుకున్నాడు. అలసటగా ఉన్నా చదివాడు. అయిదో రోజు పది అయేసరికి నిద్ర ముంచుకొచ్చింది. కాసేపు పడుకుని తర్వాత లేచి చదువుదాం అనుకున్నాడు. అలా పడక కుర్చీలో పడుకున్నవాడు మర్నాడు పొద్దున బాగా ఎండ వచ్చాక లేచాడు. ఆ రోజు రవికి చాలా బాధ కలిగింది. మర్నాడు కూడా చదవ లేదు. ఒక రోజు వృధా అయిన బాధతో చదవబుద్ధి కాలేదు. ఏదో కొంత చదివి పదకొండింటికి పడుకున్నాడు.

నాలుగు రోజులు చదివాక ఒక కొత్త విషయం గ్రహించాడు. ఏ సబ్జక్టు అయినా స్వంతంగా చదువుకున్న దానికీ, అందులో బాగా కృషి చేసిన వాళ్ళు చెప్పినదానికీ హస్తిమశకాంతరం వుందని తెలుసుకున్నాడు. అనుమానం వచ్చినప్పుడు వెంటనే తీరాలి. లేకపోతే ముందుకు సాగలేరు. అలాగే ఏది ముఖ్యమో, ఏది కాదో మనసుకి నాటాలి.

అందుకని మర్నాడు అంతకుముందు సంవత్సరం పాసయి ఉద్యోగం లేకుండా వున్న గోపాలరావు అనే ఫస్టుక్లాసు స్టూడెంటు దగ్గరకి వెళ్ళాడు. అతనికి కూడా అన్నీ తెలియవు. సబ్జక్టు మీద "పట్టు" లేదు. కొన్ని అనుమానాలు తీర్చాడు. పరీక్ష ముందు రెండు నెలలు చదివి అదృష్టం కొద్దీ క్లాసు తెచ్చుకున్న మనిషి అతను. రెండు రోజులు అతని దగ్గరకి వెళ్ళిన రవి ఆ తర్వాత మానుకున్నాడు. అతని అనుభవాలు మాత్రం తెలుసుకున్నాడు.

రవి మనసు అస్తవ్యస్తంగా తయారయింది. రోజూ ఒంటిగంట దాకా చదవడం సాధ్యం అయేలా లేదు. రాత్రి చదివితే పగలు నిద్రవస్తోంది. రోజుకి కావాల్సిన ఎనిమిది గంటల నిద్రా ఏదో విధంగా పోతూనే వున్నాడు. అయితే తనకి రాత్రి చదవటం అలవాటు కాబట్టి ఎక్కువగా బాధపడలేదు.

చదవవలసినది మహాసముద్రం అంత ఉంది. ఏ పుస్తకం పట్టుకున్నా ఇంకోటి చదవాలని అనిపిస్తోంది. పుస్తకం తెరవగానే 'ఇదెప్పటికి అవుతుంది?' అనిపిస్తోంది.

ఎప్పుడో అయిదు నెలల తర్వాత రాబోయేదాని గురించి ఇప్పుడు బ్రతుకు దుర్భరం చేసుకోవడానికి మనసు ఎదురు తిరుగుతోంది. పొద్దున్నే లేవడం, ఒక గంట చదువుకోవడం - స్నానం భోజనం చేసి కాలేజీకి వెళ్ళడం, అయిదింటికి కాలేజీనుంచి రావడం, ఒక అరగంట రెస్టు తీసుకుని మళ్ళీ చదువు. భోజనం చెయ్యగానే నిద్రవస్తుంది. అలసటవల్ల మరింతగా వస్తుంది. అక్కడనుంచి పోరాటం. నిద్ర ఆపుకోవడానికి టీ తాగి ప్రయత్నించడం, జోగుతూ చదవడం, చదువుతూనే నిద్రపోవడం.

ఒకసారి ఎదురు తిరిగి రెండురోజులు చదువు మానేశాడు ఆ రెండురోజులూ సినిమాలు చూశాడు. అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చేశాడు. ఇకనుంచీ మామూలుగా రాత్రి పదింటివరకూ చదవటం, ఆ తరువాత పడుకోవటం. అయినంత వరకూ అవ

సంపూర్ణ ఆరోగ్యానికి 3000 ఏండ్లనుంచి ప్రఖ్యాతిపొందిన

డాబర్ చ్యవనప్రాశ కుటుంబ ఆరోగ్యాన్ని నాలుగువిధాలుగా మెరుగుపరుస్తుంది.

1. శరీర కణాలను నిత్యం యవ్వనంతో ఉంచుతుంది.
డాబర్ చ్యవనప్రాశ శరీర కణాలు అరిగి, తరిగి పోయే ప్రక్రియ వేగాన్ని తగ్గిస్తుంది.
2. శరీర రోగ నివారణశక్తి పెంచుతుంది.
డాబర్ చ్యవనప్రాశ మొత్తం శరీర రోగ నివారణ శక్తి పెంచుతుంది. దగ్గు, రొంప నివారణకు కూడా మంచిది.
3. చురుకుదనం పెంచుతుంది.
డాబర్ చ్యవనప్రాశ పిల్లలలో చురుకుదనం పెంచుతుంది. వృద్ధాప్యంలో మానసిక, శారీరక శక్తులను పెంచుతుంది.
4. జీవకణ నిర్మాణ శక్తి.
డాబర్ చ్యవనప్రాశ శరీరం క్రమంగా పెరిగి, దారుఢ్యంగా ఉంచుకోడంలో తోడ్పడుతుంది.



సి విటమిను సంపన్నంగా ఉండి తీపి, పులుపుల చక్కటి రుచితో నమూనా రూపంలో లభించే మిశ్రమం

## దేవతల వంటకం
3000 ఏండ్ల క్రితం, చ్యవనుడనే ఋషి తన యవ్వనాన్ని తిరిగి పొందేందుకు, దేవతల వైద్యులు అయినవారు చ్యవనప్రాశ వాడమన్నట్లు చెబుతారు. ప్రపంచంలోని ప్రాచీన టానిక్ అయిన చ్యవనప్రాశను, ఇప్పుడు డాబర్‌వారు అధునాతనంగా, రుచిగా, తయారు చేస్తున్నారు.

1 కి.గ్రా. డబ్బాతో చెంచా ఉచితం

ఆరోగ్య సంరక్షణకు ఆయుర్వేద ఔషధం డాబర్ చ్యవనప్రాశ

# డాబర్ చ్యవనప్రాశ

అన్ని మందుల దుకాణాల్లోనూ, కెమిస్టుల వద్దా లభిస్తుంది.

తుంది సిలబస్సు. ఫస్టు క్లాసు వస్తే వస్తుంది లేకపోతేరాదు. దానికి తనేం చెయ్యలేడు.

అలా నాలుగు రోజులు విశ్రాంతి తీసుకున్నాడు. హాయిగా గడిపేశాడు.

మర్నాడు మామయ్య దగ్గర్నించి వుత్తరం వచ్చింది. "రవి బాగా చదువుతున్నాడని అనుకుంటాను. టేపు రికార్డరు కోసం డబ్బు తీసి అత్తయ్యకి ఇచ్చాను" అని.

ఆ ఉత్తరం ఇంజక్షన్‌లా పనిచేసింది రవికి. మళ్ళీ ఉత్సాహం, పట్టుదల వచ్చాయి.

చదువు ఇంట్లో అయితే లాభం లేదనుకున్నాడు. రూము తీసుకుంటే బాగుంటుందన్న ఊహ వచ్చింది. తండ్రిని అడిగాడు. "ఎంత అవుతుంది?" అని అడిగాడు ఆయన. ముప్ఫయి రూపాయలు కావాలన్నాడు రవి. తండ్రి ఆలోచనలో పడ్డాడు. ఆయన జీతం నెల ఖర్చులకి సరిపోదు. నెలకి నలభై దాకా లోటు బడ్జెటులోనే సంసారం నడుస్తోంది. చాలా సేపు ఆలోచించి రవి తల్లితో మాట్లాడి ఆవిడ సలహాలపై అవసరాలు ఇంకా తగ్గించి ఆ డబ్బులు ఇస్తానని చెప్పాడు.

అసలు రవిని డిగ్రీ చదివించడానికి కూడా ఆయన ఆలోచించవలసి వచ్చింది. 'ఎలాగన్నా చదివించాలి అని పట్టుబట్టింది రవి తల్లి. అప్పట్నుంచీ ఇంట్లో అవసరాలు తగ్గించుకున్నారు.

రవి కొత్త రూములో ప్రవేశించాడు. అది ఇంటికి ముందే రెండిళ్ళ అవతల ఉంది. భోజనానికి కాఫీకి ఇంటికి వచ్చేవాడు. తర్వాత ఒక్కొక్కసారి కాఫీ అక్కడికే పంపించేది అతని తల్లి.

కొత్త రూములో జేరిన తర్వాత కొన్ని రోజులు చదువు బాగా సాగింది. కాని చదువుతున్నప్పుడు అనుమానాలు వస్తే తీరటంలేదు. అక్కడినుంచి మాస్టారింటికి వెళ్ళివస్తే మళ్ళీ చదువుకి మూడ్ కుదిరేది కాదు. ఆయన రోజూ అవసరంఉంటే రమ్మన్నాడు. రోజూ ఒక అరగంట వెళ్ళేవాడు. ఆ అరగంటా రోజుకి మార్గదర్శకంగా ఉండేది.

తర్వాత ఆ రూము ఖాళీ చెయ్యాల్సి వచ్చింది. ఇంటివాళ్ళు వాళ్ళకే ఆ రూము కావాలన్నారు. దగ్గర్లో రూము ఏదీ లేనందువల్ల ఇంటి దగ్గిరే చదువు కొనసాగించాడు.

వరసగా చదవటంవల్ల తలనొప్పి. ఒళ్ళు నెప్పులు, అలసట రావటం మొదలు పెట్టాయి. పుస్తకం పట్టుకొంటే నిద్ర వచ్చేది.

అమ్మ చదువు మొదలు పెటినప్పటి నుంచీ అతని వెనక నీడలా వుంటోంది. రాత్రి టీ కాచి ఇచ్చేది అతను అది తాగిన తర్వాత కాసేపు అటూ ఇటూ తిరిగితే నిద్రమత్తు తగ్గేది. అక్కడి నుంచీ ఒక గంట చదవగలిగేవాడు. కాని రానురాను టీ కూడా వంటికి అలవాటయిపోయి టీ తాగినా నిద్రవచ్చేది.

"అమ్మా- చదువుతోంటే నిద్ర వస్తోందమ్మా" అన్నాడు అలసటగా.

"నేను కూడా నీతోపాటు మేలుకుంటాలే" అంది అమ్మ. పగలంతా ఊపిరి తిప్పుకోకుండా పనిచేసిన అమ్మ రాత్రి తను చదువు పూర్తిచేసేదాకా మేలుకుని వుండేది. నిద్రని బలవంతాన ఆపుకునేది. తను జోగుతోంటే తట్టి లేపేది. టీ ఎప్పుడు కావలసివస్తే అప్పుడు కాచి ఇచ్చేది. నీరసంవస్తే వంటికి నూనెరాసి కాళ్ళు చేతులు పట్టేది. అన్నం తింటే నిద్రవస్తోందని అతను అంటె, ఎప్పుడు కావాలంటే అప్పుడు పెట్టేది. అన్నం వేడిగా వుండాలంటే అతనికి వేరే వంట ఆలస్యంగా చేసేది. అతను చదువుకుంటొంటే పిల్లలు అల్లరి చెయ్యకుండా చూసేది. అతనికి నోట్సులు కావాలంటే రాసి పెట్టేది. బొమ్మలు వెయ్యాలంటే వేసిపెట్టేది. తను ఎన్నాళ్ళనుంచో రాయకుండా వున్న రికార్డులు రాసిపెట్టి సమయం కలిసివచ్చేలా చేసింది. ఏ ప్రశ్నలో అయినా పాయింటు తను చెబుతూంటే తనకి తెలిసినంత వరకు వినేది. ఎక్కువ చదువుకోలేదు కాబట్టి అతను చెప్పే పాయింట్లలో తప్పు ఒప్పులు చెప్పే శక్తి లేక పోయినా, అతను పాయింట్లు తనకి జ్ఞాపకం ఉన్నాయో లేదో పరీక్షించుకోడానికి పుస్తకం చూస్తూ సహకరించేది. అతను స్వయంగా పరీక్షగా రాసిన పేపరని పుస్తకంతో పోల్చి వీలయినంత దిద్దేది.

చూస్తుండగానే పరీక్షలు దగ్గరికి వచ్చేశాయి. నెలరోజులు ఉన్నాయనగా కూడా అతనికి ఇంకా సబ్జక్టులు ఒక కొలిక్కి రాలేదు. ప్లాను ప్రకారం అతను రివిజన్ మొదలు పెట్టాలి. అతను అనుకున్న ప్రకారం ఏదీ జరగలేదు. 'ఇంకో పది రోజులు టైము ఉంటే బాగుండేది' అనుకున్నాడు.

పరీక్షలు పదిరోజు లుండగా 'ఇంకా రెండు రోజులు టైము ఉంటే బాగుండేది' అనుకున్నాడు.


పరీక్ష రేపనగా మాత్రం 'ఈ పరీక్షలు ఎలాగో ఒకలాగా అయిపోతే బాగుండు' ననిపించింది. విసుగు వచ్చేసింది. బాగా రాసినా రాయక పోయినా ఈ టెన్షన్ మాత్రం తను ఇంక భరించలేడు.

ఆ మధ్యాహ్నం అతను పుస్తకాలు పక్కకు నెట్టేశాడు ఒకసారి క్విక్ రివిజన్ చెయ్యడం చాలా ఉపయోగం అని తెలిసి విసుగ్గా చదివింది చాల్లే అనుకున్నాడు.

అదే టైముకి పోస్టులో ఉత్తరం వచ్చింది. 'రవికోసం టేపు రికార్డరుచూసి సెలక్టు చేశాను. ఇక ఆర్డరు ఇవ్వటమే తరువాయి' అని రాశాడు మామయ్య.

రవి తోసేసిన పుస్తకాలని తన ముందుకి లాక్కున్నాడు.

* * *



పరీక్షకి వెళ్ళబోయేముందు ఆలోచించుకుంటే తను చదివినవన్నీ ఈ మూడు గంటల్లో జ్ఞాపకం వస్తాయా అని అనుమానం వచ్చింది. ఈ పరీక్షా విధానంలోనే మౌలికంగా లోపం వుందన్న అభిప్రాయం బలపడింది. పరీక్షల్లో విద్యార్థి ఎంత త్వరగా రాయగలడు? అతని జ్ఞాపకశక్తి ఎంత? అని పరీక్ష చేస్తారు తప్ప అతని తెలివితేటలు. విమర్శనాశక్తి ఎంత? అని పరీక్షించడం తక్కువ.

తండ్రి ఒక విషయం గట్టిగా చెప్పాడు. ఒక పరీక్ష పొరపాటున కష్టంగా ఉండిగాని. లేదా అనుకున్నవన్నీ ఏ కారణం చేతనయినా - గుర్తు లేకగానీ. టైములేకగానీ - రాయలేక పోయినా మనసు పాడు చేసుకొని మిగతా పరీక్షలు చెడగొట్ట కూడదు. ఎటువంటి పరిస్థితి వచ్చినా అది వచ్చినందుకు బాధ పడటం మానేసి "ఇప్పుడు ఈ పరిస్థితులలో ఏం చెయ్యాలి?! అని వెంటనే ఆలోచించగలగాలి.

రవి మనసులో ఇది బాగా నాటింది. అందుకే రెండు పరీక్షల్లో తను అనుకున్న దానిలో సగం రాయలేకపోయినా చెదర లేదు. మూడు వంతులు సాధించ గలిగితే అంతా సాధించినట్లే అని గుర్తు తెచ్చుకొన్నాడు. నిబ్బరమైన మనసుతో పరీక్షలు రాశాడు.

మొత్తంమీద పరీక్షలన్నీ బాగానే రాశాడు. బేరీజు వేసుకుంటే 58% నుంచి 63% మధ్యలో మార్కులు వస్తాయనుకున్నాడు. అతనికి ఫస్టుక్లాసు రావడానికి అవకాశం ఎంత వుందో రాకపోవడానికీ అంతే అవకాశం వున్నా బాధ కలగలేదు. చిత్తశుద్ధితో కృషి చేశానన్న తృప్తి మిగిలింది.

పరీక్షలు అయిపోయిన రోజున అతను అందరిలా సినిమాకి వెళ్ళలేదు. ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నాడు. అతనికి పెద్ద గాలివాన వెలిసినట్లు. ఒక మహాయజ్ఞం పూర్తయినట్లు వుంది. ఏ పనీ చెయ్యాలని లేదు. చెయ్య కూడదనీలేదు. నిర్లిప్తత. నిర్వికారం మనస్సును ఆవరించాయి. కిటికీ ముందు కుర్చీలో కూర్చుని అలా నిద్రపోయాడు. రెండు రోజులు ఏ పనీ చెయ్యలేదు. ఏ సినిమాకీ వెళ్ళలేదు. ఆ తర్వాత సినిమాకి వెళ్ళాడు. సినిమా కూడా సరిగ్గా చూడలేదు. ఎందుకో తను వీటికీ ఈ రాగద్వేషాలకు అతీతుడిలా అనిపించింది.

ఆ తర్వాత మామూలుగా అయాడు. ఆ పైన రోజులు చాలా త్వరగా గడిచిపోయాయి.

* * *

కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకున్నాక ఆరోగ్యం బాగుపడింది. అప్పుడే తల్లి ఆరోగ్యం కూడా బాగుపడింది.

రిజల్ట్సు వస్తాయని తెలిసిన రోజున మళ్ళీ కదలిక వచ్చింది. శరీరంలో ఒక రకం వణుకు వచ్చింది. రిజల్టు చూసుకో బుద్ధి కాలేదు. అందుకనే పేపరు వచ్చినా బయటికి వెళ్ళలేదు. 'ఇంకా రిజల్టు తెలియని స్థితి' అదో హాయి.

59% వస్తే సెకండు క్లాసు. 60% వస్తే ఫస్టు క్లాసు.

ఎంత తేడా!

నాన్నగారు పేపరు తీసుకువస్తారన్న టైముకి ఇంట్లోంచి బయటికి వెళ్ళిపోయాడు. ఒక గంటసేపు చెరువు పక్క తోటలో కూర్చుని వచ్చాడు.

ఇంటికి వచ్చేటప్పటికి తండ్రి ఎదురు వచ్చాడు. "ఒరేయ్ నీకు ఫస్టుక్లాసు వచ్చిందిరా" అంటూ.

రవి ఒంట్లో రకం పరుగులు తీసింది. చటుక్కున పేపరు అందుకున్నాడు తన నెంబరు తనివితీరా చూసుకున్నాడు. మళ్ళీ మళ్ళీ చూసుకున్నాడు.

కళ్ళవెంట అప్రయత్నంగా నీళ్ళు వచ్చాయి.

* * *

రిజల్టు చూసుకుని మామయ్య అత్తయ్యతోసహా వూరినుంచి దిగాడు. వచ్చేటప్పుడు టేపు రికార్డరు తెచ్చాడు. దారిలో బజారులో స్వీట్లు తీసుకున్నాడు. రాగానే రవిని కంగ్రాచ్యులేట్ చేశాడు.

'టేపు రికార్డరివ్వండి' అంది అత్తయ్య

'ఇప్పుడు కాదు. సాయంత్రం చిన్న పార్టీ ఏర్పాటు చేసి అప్పుడు ఇస్తాను అన్నాడు.

అంతా తనే కలగజేసుకుని తనఖర్చుతో చిన్నపార్టీ ఏర్పాటు చేశాడు. ఒక పది మందిని పిలిచారు రవి వాళ్ళ మాష్టార్ని పిలిచాడు. రవి స్నేహితులు. రవి తండ్రి స్నేహితులు ఒక రిద్దరు వచ్చారు.

పార్టీ బాగా జరిగింది.

రవి మాత్రం చాలా సిగ్గుపడిపోయాడు అందరి దృష్టికి కేంద్రంగా. ఆ పార్టీకి కారకుడిగా వుండటం అతనికి సిగ్గు కలిగించింది.

రవి తండ్రి మాస్టార్ని. మామయ్యని అక్కడి వాళ్ళకి పరిచయం చేశాడు. వాళ్ళని వాళ్ళిద్దరికీ పరిచయం చేశాడు.

"రికార్డరు మాస్టారిచేత ఇప్పించండి" అంది అత్తయ్య మామయ్య చెవిలో. ఆయన మాస్టారి దగ్గరికి వెళ్ళి "రవి సాధించిన దానికి మీరు కారకులు. మీరు ఇవ్వండి" అన్నాడు. మాస్టారు "నేను చేసినది చాలా తక్కువ. మీరు ఇన్సెంటివ్ చూపించారు. అది బలంగా పని చేసింది. వాళ్ళ నాన్నగారు చక్కగా గైడ్ చేశారట" అన్నాడు. రవి తండ్రిని అడిగితే "నేను వాడికి ఇవ్వడం ఏమిటి? చేసిందంతా మీ ఇద్దరూ?" అన్నాడు.

అక్కడ వున్న వాళ్ళలో ఒకరు "మీ ముగ్గురూ కారకులే అందుకని ముగ్గురూ కలిసి ఇవ్వండి" అన్నారు.

అలాగే ముగ్గురూ చేతులువేసి ఇస్తోంటే అందుకుంటూ రవి బాధగా వెనక్కి చూశాడు.

గుమ్మంలో అమ్మ నుంచుని వుంది. నవ్వుతో వుంది!

రవి అశోక స్తంభంవైపు చూశాడు. మూడు సింహాలే కనిపిస్తున్నాయి అక్కడున్న వాళ్ళకి. నాలుగో సింహం వుందని తనకి మాత్రమే తెలుసు!

తనకి గుర్తింపులేదని ఆ నాలుగో సింహానికి బాధలేదు!

అమ్మ నిర్మలంగా నవ్వుతూ సంతృప్తిగా చూస్తోంది.

గుర్తించబడకపోయినా, నాలుగో సింహంలా నవ్వుతూ నిలిచే.. 'అమ్మ'లకు

— రచయితలు

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!